క్లుప్తంగా

మండల వ్యవసాయాధికారి పద్మావతి బదిలీ



బొంరాస్‌పేట: మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న పద్మావతి జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయాధికారిగా నియమితులయ్యారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాలకు వ్యవసాయ సేవలు, సలహాలు సూచనలనిచ్చి రైతుల మన్ననలు పొందారు. ఇక్కడికి ఏటిగా అనురాధ రానున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కొడంగల్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన బాధితుడికి మంజూరైన చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నారం మాజీ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు, కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: నిరుపేదలకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నర్సయ్య భార్య చెన్నమ్మ ఆకస్మికంగా మృతిచెందింది. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, భాస్కర్, షర్ఫుద్దీన్, సోమలింగం, చిన్న వెంకటేష్, పెంటయ్య, బాలయ్య, చెన్నప్ప, అంజయ్య, రాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల పేరిట దోపిడీ

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాదయ్య



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ టీపీ నాయకులు

పరిగి: అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోళ్ల యాదయ్య అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మండల విద్యాధికారి హరిశ్చందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువులను నర్సరీ నుంచే లక్షలు పెట్టి కొనుక్కోవల్సి వస్తుందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం చదువు వ్యాపారం చేయరాదని స్వచ్ఛందంగా విద్యను అందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వినితిపత్రం ఇచ్చిన వారిలో జాకబ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'రూ.లక్ష సాయానికి' గడువు పెంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పీఎన్‌పీఎస్ సంఘు నేతలు

కుల్కచర్ల: బీసీ కులవృత్తిదారులకు లక్ష రూపాయల రుణాన్ని అందించే స్కీంకు గడువు తేదీని పొడగించాలని పీఎన్‌పీఎస్ సంఘు వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకరిద్దరితో పథకాన్ని నామమాత్రంగా కొనసాగిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

కుల్కచర్ల: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో పలు కాలనీలలో పర్యటించి గ్రామస్తులకు, దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





వికారాబాద్ అర్బన్: యోగా చేస్తున్న డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు



కుల్కచర్ల: యువకులతో కలిసి యోగా చేస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం

ప్రశాంతత, ఆరోగ్యానికి 'యోగా'

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఆసనాలు వేసిన అధికారులు, విద్యార్థులు



పెద్దేముల్: జెడ్పీహెచ్ఎస్‌లో..

యాంత్రిక జీవనంలో విశ్రాంతి కరువై శారీరక, మానసిక రుగ్మతలతో ఆస్పత్రుల చుట్టూ తిరిగినా తగ్గని జబ్బులు యోగాతో నయమవుతున్నాయి. దీంతో యోగాకు ప్రాధాన్యత పెరిగింది. శిక్షకులూ పెరుగుతున్నారు. ప్రజలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కావడమే కాకుండా హోం ట్యూషన్లు ఊపందుకున్నాయి.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్: జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో..



తాండూరు టౌన్: ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..



కొడంగల్: యోగా గురువును సన్మానిస్తున్న అభ్యాసకులు



పరిగి: శిశుమందిర్‌లో..

సమాచారం

నేడు ప్రత్యేక సమావేశం

కొడంగల్: మండల పరిషత్ ప్రత్యేక సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పాండు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మోమిన్‌పేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ డి.వసంత వెంకట్ అధ్యక్షతన నిర్వహించు సమావేశానికి మండల స్థాయి ప్రభుత్వ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సకాలంలో హాజరవ్వాలని ఆమె కోరారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవం

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్‌లో గురువారం నుంచి శనివారం వరకు రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పలు విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు బుధవారం ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

26న కంటి వైద్య శిబిరం

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 26న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆప్తమాలిక్ అసిస్టెంట్ హరినాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, అంధత్వ నివారణ సంస్థ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిబిరం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు చేస్తారని చెప్పారు. అవసరం ఉన్న వారికి మహబూబ్‌నగర్‌లోని కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేస్తారన్నారు.

రూ.50 చెల్లిస్తే ఏడాదంతా ప్రయాణం



బస్సు పాసులను అందజేస్తున్న అనంతయ్య

మోమిన్‌పేట: విద్యార్థులు రూ.50 చెల్లించి ఏడాది అంతా ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఉద్యోగి అనంతయ్య చెప్పారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత బస్సుపాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలు, 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు బాలురు రూ.50 చెల్లించి సెలవు రోజుల్లో మినహా ఏడాది పొడవునా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని వివరించారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనుంజయ్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలు చేస్తాం

కో ఆపరేటివ్ బ్యాంక్ ఏజీఎం రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

బంట్వారం: దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతుల నుంచి రూ.3కోట్ల మొండి బకాయిలున్నాయని.. వాటిని త్వరలోనే వసూలు చేస్తామని హైదరాబాద్ కోఆపరేటివ్ బ్యాంక్ ఏజీఎం రమేశ్ అన్నారు. బుధవారం ఆయన బంట్వారం, తొర్మామిడి, బొప్పునారం, బార్వాద్ గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జూన్ 30 నాటికి 60 శాతం రికవరీ ఉంటేనే మళ్లీ కొత్త రుణాలు ఇస్తామన్నారు. ఎల్‌టీ లోన్ పిరిమడ్ ఐదేళ్లు మాత్రమే ఉండగా.. 15ఏళ్లు దాటినా చెల్లించడం లేదన్నారు. సుమారు 120 మంది మొండి బకాయిదారుల పై లీగల్ కవరేజ్ చేస్తున్నామన్నారు. ముందుగా నోటీసులు జారీ చేసి ఆస్తుల జప్తునకు వెనకాడమన్నారు. రిజర్వు బ్యాంక్ నిబంధనల ప్రకారం అవసరమై చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మోమిన్‌పేట బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి, బంట్వారం సీఈఓ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పట్నం పార్టీ మారడం పుకార్లే

పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్

తాండూరు: ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇద్దరూ రాజకీయ విలువలను మంటగలిపారని పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్ అన్నారు. మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లలో చేరుతున్నారనడం వట్టి పుకార్లే అన్నారు. బీఆర్‌ఎస్‌లో లబ్ధి పొందేందుకే ఈ ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రమేశ్ మహరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశామన్నారు. కాంగ్రెస్ నుంచి వెళ్లిన రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేల ఎర కేసుతో సీఎం కేసీఆర్‌కు దగ్గరయ్యారన్నారు. మరోవైపు రోహిత్‌రెడ్డితో మహేందర్‌రెడ్డికి విబేధాలుండడంతో బీఆర్‌ఎస్ టికెట్ తనకే వస్తోందని ప్రకటించిన మహేందర్‌రెడ్డి ప్రస్తుతం మాట్లాడకపోవడంపై అనుమానంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోండటంతో గెలిచే పార్టీలోకి వచ్చేందుకు మ హేందర్ రెడ్డి ప్రయత్నాలు చేసే అవకాశం లేకపోలేదన్నారు. కాంగ్రెస్ తరఫున తాండూరు నుంచి రమేశ్ మహరాజ్ బరిలోకి దిగడం ఖాయమన్నారు.

స్వరాష్ట్ర సాకారానికి జయశంకర్ పునాది



అనంతగిరి: నివాళి అర్పిస్తున్న శుభప్రద్ పటేల్, మంజుల తదితరులు



బొంరాస్‌పేట: మండల కార్యాలయం ఎదుట..

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్

బొంరాస్‌పేట: 'జోహార్ ప్రొఫెసర్ జయశంకర్'.. అంటూ బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో సోమవారం తెలంగాణ విద్యావంతుల వేదిక(టీవీవీ) ఆధ్వర్యంలో జయశంకర్ 12వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన విగ్రహాలకు నివాళులర్పించారు. బొంరాస్‌పేట మండల కేంద్రంలోని జయశంకర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కార్యాలయం ఎదుట, మండల విద్యావనరుల కేంద్రం ఎదుట విగ్రహం వద్ద జయశంకర్ చిత్రపటానికి టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వరాష్ట్ర సాకారానికి తెలంగాణ జాతిపితగా పిలిచే దివంగత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ పునాదిఅన్నారు. జయశంకర్ ఆశయాల సాధనకు టీవీవీ కృషి చేస్తోందని రవీందర్‌గౌడ్ అన్నారు. ఆయన చేసిన కృషిని, ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించేవరకు టీవీవీ పోరాడుతుందన్నారు. నిరుద్యోగాన్ని నిర్మూలించిన నాడే జయశంకర్ ఆశయాల సాధన కృషి ఫలించినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, టీవీవీ, టీజేఏసీ నియోజకవర్గ కన్వీనర్ గౌరారం గోపాల్, జీహెచ్‌ఎంలు పాపిరెడ్డి, శ్రీహరిరెడ్డి, అనిల్ కుమార్, కాశీపతి, లక్ష్మి, శ్రీప్రియ, రాజశేఖర్, మల్లేశ్, రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: ఎమ్మార్సీ భవనం ఎదుట నివాళి అర్పిస్తున్న టీవీవీ, టీజేఏసీ నాయకులు

'సార్ ఆశయాలకు వ్యతిరేకంగా పాలన'

తాండూరు టౌన్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలకు వ్యతిరేకంగా రాష్ట్ర పాలన కొనసాగుతోందని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇంచార్జి, కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. బుధవారం జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఇందిరాచౌక్‌లోని ఆయన విగ్రహానికి పలువురు ఉద్యమకారులు, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు, అమరుల బలిదానంతో తెచ్చుకున్న తెలంగాణ నేడు ఒక కుటుంబం చేతిలో బంధీగా మారిందన్నారు. సామాజిక తెలంగాణ కోసం మరో మారు ఉద్యమాన్ని చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్, పి.రామకృష్ణ, రవీందర్, నూరొద్దీన్, గౌరి, సందీప్, అరుణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న టీజేఎస్, జేఏసీ నేతలు

ఆయన ఆశయసాధనకు కృషి చేయాలి

అనంతగిరి: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. బుధవారం జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని వికారాబాద్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, వీడీడీఎఫ్ ప్రతినిధి శ్రీనివాస్, కౌన్సిలర్ స్వాతి రాజ్‌కుమార్, పంచాయతీ రాజ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవం.. ఆధ్యాత్మిక వైభవం

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను అందంగా ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలకరించారు. మామిడి తోరణాలతో పచ్చని పందిళ్లు వేశారు. ఆలయాల్లో ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేశారు.



వికారాబాద్ అర్బన్: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు



కొడంగల్ రూరల్: ఆంజనేయ స్వామి ఆలయంలో..



మర్పల్లి: సెంట్రల్ మెథడిస్టు చర్చిలో...



పెద్దేముల్: చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



పరిగి: వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



పరిగి: మసీదులో ప్రార్థనలు

కూల్చిన స్థలంలో జూనియర్ కళాశాల నిర్మించాలి

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్

తాండూరు టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని గతలంలో కూల్చిన స్థలంలోనే నిర్మించాలని ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ బుధవారం అధికారులను డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొందరు నాయకుల ప్రోద్బలంతో కళాశాల గ్రౌండ్‌లో వాణిజ్య సముదాయం నిర్మించేందుకు చూస్తున్నారని ఆరోపించారు. కళాశాల నుంచి గ్రౌండ్ వేరు చేసి వాణిజ్య సముదాయం నిర్మించాలని చూస్తే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోలన చేస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్ సంఘం గ్రామ కమిటీ నియామకం

కుల్కచర్ల: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం చౌడాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్‌లో అంబేడ్కర్ సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా చిన్న వెంకటేష్, కోశాధికారిగా లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.